సాక్షి చిత్తూరు

శనివారం । 28 । జనవరి । 2023



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,100
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.70,000
రిటైల్ వెండి గ్రాము రూ.73



	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	31	17
తిరుపతి	31	18
తిరుమల	27	14
గూడూరు	32	21
నగరి	32	19



ఏటీఎం కేటుగాడు
డబ్బులు డ్రా చేసిస్తా..పిన్ నంబర్ జనరేషన్ చేసిస్తా..అని ఏటీఎంల వద్ద కార్డులు మార్చి, డబ్బులు కొట్టేస్తున్న ఓ కేటుగాడిని వలపన్ని వడమాలపేట పోలీసులు అరెస్ట్ చేశారు.

8లో▸

న్యూస్‌రీల్

ఆక్రమణల నుంచి విముక్తి



సర్వే చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

శ్రీరంగరాజపురం: ఆక్రమణకు గురైన దళితుల శ్మశాన వాటికను స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో 'దళితుల శ్మశాన వాటిక ఆక్రమణ' శీర్షికతో ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. మండలంలోని మెదవాడ పంచాయతీ మర్రిపల్లె గ్రామ దళితవాడ శ్మశానం ఆక్రమణకు గురవడం విధితమే. కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ షాబీర్ బాషా ఆర్ఐ త్యాగరాజులు, సర్వేయర్ మురళి, వీఆర్ఓ గోవిందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అమర్‌నాథ్ తదితరులతో వెళ్లి శ్మశాన వాటికను సర్వే చేయించారు. ఆక్రమణలను తొలగించి గ్రామస్తులకు అప్పగించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారి

చిత్తూరు రూరల్: సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.ప్రకాశం అన్నారు. చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ప్రతి గర్భిణి వివరాలు అందుబాటులో ఉండాలన్నారు. డీఐఓ రవిరాజు, అధికారులు రమేష్ రెడ్డి, గుణశేఖర్, రేణుక ప్రభ పాల్గొన్నారు.

సమయపాలన ముఖ్యం

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు పరీక్షా కాలంలో సమయపాలన ముఖ్యమని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన పరీక్షా పే చర్చ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఆయా సబ్జెక్టుల టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

74.96 ఎకరాల ప్రభుత్వ పరం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని విజయపురం మండలంలో 74.96 ఎకరాల అసైన్‌మెంట్ భూములను ప్రభుత్వ పరం చేస్తున్నట్లు జేసీ వెంకటేశ్వర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. అసైన్డ్ భూముల అక్రమ లావాదేవీలను రద్దు చేశారు. 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై జేసీ దృష్టి సారించడంతో ఆ కేసుకు మోక్షం లభించింది.

అక్రమ రిజిస్ట్రేషన్

విజయపురం మండలం పాత ఆర్కాడ్‌లోని మహారాజపురం, శ్రీహరిపురంలో కొందరు అసైన్‌మెంట్ భూములను పొందారు. చెన్నైకి చెందిన పలువురు ఆ ప్రాంతంలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని, ఇందులో పవన్‌కుమార్ అనే వ్యక్తి నుంచి 16.13 ఎకరాలు, సీవీఎస్ రవి ప్రసాద్ నుంచి 12.8 ఎకరాలు, చంద్రశేఖర్‌రెడ్డి నుంచి 8.96 ఎకరాలు, రాజేష్‌కుమార్ నుంచి 19.27 ఎకరాలు, 0.78 ఎకరాలు, మూర్తి నుంచి 13.92 ఎకరాలు అమృత ఎస్టేట్‌కు చెందిన 3.1 ఎకరాలు.. మొత్తం 74.96 ఎకరాలు ప్రభుత్వ పరం చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 400 ఎకరాలకు పైగా భూములను జేసీ ప్రభుత్వ పరం చేశారు.



పలమనేరు గంద్రాజుపల్లెలోని విశ్వ గార్మెంట్స్ కంపెనీ



పారిశ్రామిక ప్రగతి.. యువతకు ఉపాధి

- 4,382 ఎకరాల్లో 'నోడ్' ఇండస్ట్రియల్ పార్క్
- నగరిలోనూ మినీ సెజ్
- విజయపురంలో శరవేగంగా కొత్త పరిశ్రమల నిర్మాణ పనులు
- మూడున్నరేళ్లలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 4,812 పరిశ్రమలు
- రూ.10,703 కోట్ల పెట్టుబడి
- మొత్తం 47,086 మందికి ఉపాధి అవకాశాలు

సాక్షి, చిత్తూరు/చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక చిత్తూరు జిల్లాలో పారిశ్రామిక ప్రగతి చక్రం పరుగులు తీస్తోంది. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం నిబంధనలను సరళతరం చేయడం, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తక్కువ ధరకే భూమి ఇవ్వడం, రవాణా సౌకర్యానికి హైవేలు అనుకూలంగా ఉండడంతో పారిశ్రామికవేత్తల చూపు చిత్తూరు జిల్లాపై పడింది. ఫలితంగా మూడున్నరేళ్లలో పలమనేరుతోపాటు పలుచోట్ల కొత్తగా పెద్ద, చిన్న తరహా పరిశ్రమలు స్థాపించారు. ఇది వరకే నగరి నియోజవర్గం విజయపురం మండలంలో మొత్తం 8 వేల ఎకరాల్లో మినీ సెజ్ ఏర్పాటుకు ఇప్పటికే 2400 ఎకరాల భూ సేకరణ పూర్తయ్యింది. పరిశ్రమల నిర్మాణ పనులు జోరందుకున్నాయి. మూడున్నరేళ్లలోనే ఉమ్మడి జిల్లాలో 4,812 పరిశ్రమలు ప్రారంభమయ్యాయి. రూ.10,703 కోట్ల పెట్టుబడుల వచ్చాయి. మొత్తం 47,086 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి.

కొత్త ఇండస్ట్రియల్ పార్క్

చిత్తూరు జిల్లాలోని పడమటి మండలాల్లో పలమనేరు-పుంగనూరు వరకు 4,382 ఎకరాల్లో 'నోడ్' పేరిట కొత్తగా పారిశ్రామిక వాడ ఏర్పాటుకు భూ సేకరణ పనులు మొదలెట్టారు. ఇది పూర్తయితే వందల సంఖ్యలో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. వీటి వల్ల వేలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయి.

నగరిలో 8 వేల ఎకరాల్లో మినీ సెజ్

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌళిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) నేతృత్వంలో నగరి నియోజవర్గం విజయపురం మండలంలో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. మొత్తం 8 వేల ఎకరాల్లో మినీ సెజ్ పనులు వేగంగా సాగుతున్నాయి. విజయపురం మండలంలో సుమారు 2400 ఎకరాలు, వీకేఆర్ పురంలో 349 ఎకరాల్లో భూ సేకరణ చేశారు. మరో 11 గ్రామాల్లో ఏపీఐఐసీ సర్వే పూర్తి చేసింది. ఈ మినీ సెజ్ పూర్తయితే విజయపురం మండలంలో 25 పంచాయతీ, 145 గ్రామాల్లో వలసలు తగ్గే అవకాశాలున్నాయని అధికారుల సర్వే గణాంకాలు చెబుతున్నాయి.



జీడీనెల్లూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటుకు సీఎం జగన్ చేతుల మీదుగా అనుమతి పత్రం అందుకుంటున్న డీవీ గ్రూప్ సంస్థల చైర్మన్ దీపక్ కుమార్ తాళ్ల (ఫైల్)



నింద్ర మండలంలో అమ్మయప్పన్ టెక్స్‌టైల్ పరిశ్రమ నిర్మాణ పనులు

హైవేలతో తగ్గిన దూరం

చిత్తూరు జిల్లాలోని నగరి, చిత్తూరు, పలమనేరు నియోజకవర్గాలు ఇటు తమిళనాడు, అటు కర్ణాటకకు అతి సమీపంలోనే ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోనే హైవేలున్నాయి. నిర్మాణంలో ఉన్న చిత్తూరు-తచ్చూరు, చెన్నయ్-బెంగళూరు వరకు ఎక్స్‌ప్రెస్ హైవేలు వచ్చే ఏడాదికి అందుబాటులోకి రానున్నాయి. వీటితో దూరం మరింత తగ్గి, రవాణా విస్తృతి పెరిగే అవకాశాలున్నాయి.

రెండు పారిశ్రామికవాడలతో...

విజయపురం, పలమనేరు ప్రాంతంలో కొత్త పారిశ్రామకవాడలు ఆవిర్భవిస్తే వందల సంఖ్యలో పరిశ్రమలు వచ్చే అవకాశాలున్నాయి. నగరి మినీ సెజ్ కోసం ఇప్పటికే పలు కార్పొరేట్ సంస్థలు సంప్రదింపులు చేయడంతో ఏపీఐఐసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. స్థానికుల అభిప్రాయాలు సేకరించింది. త్వరలో రోడ్లు, విద్యుత్, తాగునీటి వసతులు కల్పించే దిశగా అడుగులు వేస్తోంది.

ప్రభుత్వ సబ్సిడీలివే!

- పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చేవారికి ప్రభుత్వం పలు రాయితీలు ఇస్తోంది. పెట్టుబడి రీయింబర్స్‌మెంట్ కింద జనరల్ కేటగిరీకి 15 శాతం, బీసీ మహిళలకు 35 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం ఇస్తున్నారు.
- అమ్మకపు పన్ను సబ్సిడీ కింద ఐదేళ్లకు 100 శాతం రాయితీ ఇస్తోంది.
- విద్యుత్తు ఒక యూనిట్‌కు రూ.1 చొప్పున, ఎస్సీ ఎస్టీలకు రూ.1.50 చొప్పున ఐదేళ్ల రీయింబర్స్‌మెంట్ ఇస్తోంది.
- ల్యాండ్ సబ్సిడీ కింద బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం సబ్సిడీ.
- యంత్రాల రుణ సబ్సిడీ కింద 3 శాతం వడ్డీని ఐదేళ్ల రీయింబర్స్‌మెంట్ చేస్తోంది.

ఉద్యోగ, ఉపాధి కల్పనలో తిరుగులేని విశ్వ గార్మెంట్స్

పలమనేరు నియోజకవర్గంలోని గంద్రాజుపల్లెలో ఇండస్ట్రియల్ పార్క్‌లో 10 ఎకరాలలో రూ.20కోట్లతో విశ్వ గార్మెంట్స్ పరిశ్రమను 2020 మార్చిలో స్థాపించారు. ప్రస్తుతం 1200 మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. ఇతర దేశాలకు ఎగుమతులే లక్ష్యంగా ఇక్కడ రెడీమేడ్ దుస్తులను తయారు చేస్తున్నారు. ఈ పరిశ్రమ నెలకొల్పేందుకు కేటాయించిన భూమి విలువ రూ.1.78 కోట్లు. అయితే ప్రభుత్వం 50శాతం రాయితీతో రూ.89 లక్షలకే కేటాయించింది విద్యుత్, ఇతర మౌళిక సదుపాయాలు కల్పించింది. అన్ని రకాల రాయితీలూ వర్తింపజేసింది.

ఉమ్మడి జిల్లాలో పెద్దపరిశ్రమలు

సంవత్సరం	పరిశ్రమల సంఖ్య	పెట్టుబడి రూ.కోట్లలో	ఉపాధి పొందినవారు
2019-20	11	2584	4261
2020-21	6	2397	2245
2021-22	4	685	1110
2022-23	9	3507	6535
మొత్తం	30	9,443	14,151

ఎంఎస్ఎంఈ ద్వారా.. మైక్రో, స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ- సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) మూడున్నరేళ్లుగా ప్రగతి పథంలో దూసుకుపోతున్నాయి. వాటిలో ..

సంవత్సరం	పరిశ్రమల సంఖ్య	పెట్టుబడి రూ.కోట్లలో	ఉపాధి పొందినవారు
2019-20	634	353	8646
2020-21	263	250	2704
2021-22	673	212	4371
2022-23	3212	435	17214
మొత్తం	4,782	1,260	32,935

చిత్తూరు జిల్లాలో కొత్త పరిశ్రమల నిర్మాణాలివే..

- గంగాధరనెల్లూరు నియోజకవర్గం కొత్తపల్లిమిట్ట పంచాయతీలోని కొట్టార్లలో సాఫ్ట్‌వేర్ కంపెనీ పురుడు పోసుకుంది. రూ.50 కోట్ల అంచనాతో దీనిని బెంగుళూరుకు చెందిన డీవీ గ్రూప్ సాఫ్ట్‌వేర్ కంపెనీ 2022 ఏప్రిల్ 14న భూమి పూజ చేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆ కంపెనీ చైర్మన్ దీపక్‌కుమార్ తాళ్ల ఐటీ కంపెనీ నిర్మాణానికి ఒప్పంద పత్రాన్ని అందుకున్నారు. డిప్లొమా, బీటెక్, బీకాం, బీఏ పూర్తిచేసిన 600 మందికి, మలివిడతలో 4వేల మందికి పైగా ఉద్యోగాలు ఇవ్వాలనే లక్ష్యంతో యాజమాన్యం ఉంటోంది.
- పూతలపట్టు నియోజకవర్గ కేంద్రంలోని తేనెపల్లెలో రూ.89.86 కోట్లతో 'మంగళ్ ఇండ్రస్టీస్'ను నిర్మిస్తున్నారు. ఇక్కడ బ్యాటరీలకు వాడే పరికరాలు తయారు చేయనున్నారు. 460 మందికి ఉపాధి కల్పించనున్నారు.
- కుప్పం నియోజవర్గం గుడుపల్లె మండలంలోని 'ఓరగేటు' పరిశ్రమకు అనుమతిచ్చారు. రూ.30 కోట్లతో దీనిని నిర్మిస్తున్నారు. మొత్తం 30 మందికి ఉపాధి పొందనున్నారు. ప్రస్తుతం పరిశ్రమ నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇక్కడ పశువుల దాణా తయారు చేయనున్నారు.
- నగరి నియోజవర్గం నింద్ర మండలంలో రూ.29.05 కోట్లతో 'అమ్మయప్పన్ టెక్స్‌టైల్' పరిశ్రమ నిర్మాణ పనులు సాగుతున్నాయి. సుమారు 2,300 మందికి ఉపాధి కల్పించాన్నదే లక్ష్యం.



జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన చిన్నతరహా గ్రానైట్ పరిశ్రమ

- విజయపురం మండలం కోసలనగరంలో వేస్ట్ అయిల్ నుంచి రీ యూజ్ అయిల్ తయారీ కోసం రూ.5 కోట్లతో 'బాలాజీ పెట్రోల్, కెమికల్' ఫ్యాక్టరీ నిర్మాణ పనులు సాగుతున్నాయి. అలాగే కోసలనగరంలోనే ప్లాస్టిక్ ప్యాకింగ్‌కు సంబంధించిన వస్తువుల తయారీ కోసం 'ఫిట్ టూ పాక్' పరిశ్రమను 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.10 కోట్లతో నిర్మిస్తున్నారు. 40 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు.
- పుంగనూరు నియోజకవర్గ కేంద్రంలోని ఆరేడిగుంటలో 'ఎలక్ట్రో స్టీల్ క్యాస్టింగ్' పైపులపరిశ్రమ స్థాపనకు భూ సేకరణ చేశారు. రూ.180 కోట్లతో పరిశ్రమ ప్రారంభం కానుంది. ఇక్కడ 230 మందికి ఉపాధి లభించనుంది. అలాగే పుంగనూరు మండలం ఆరడిగుంటలో రూ.52కోట్లతో గ్యాస్ సిలిండర్ల తయారీ పరిశ్రమకు అనుమతిచ్చారు. మొత్తం 12 ఎకరాలు స్థలాన్ని కేటాయించారు. మదనపల్లె చెందిన జబ్బాల శ్రీనివాసులు నేతృత్వంలో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.



నింద్ర మండలంలో అమ్మయప్పన్ టెక్స్‌టైల్ పరిశ్రమ నిర్మాణ పనులు

ఉమ్మడి జిల్లాలో 47 వేల మందికి ఉపాధి

రూ.9,443 కోట్లతో జిల్లాలో 30 దాకా భారీ పరిశ్రమలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 14,151 మంది ఉపాధి పొందుతున్నారు. రూ.1,260 కోట్లతో 4,782 చిన్న తరహా పరిశ్రమలను నెలకొల్పగా తద్వారా 32,935 మంది ఉపాధి లభిస్తోంది. మొత్తం రూ.10,703 కోట్ల పెట్టుబడితో 4,812 పరిశ్రమలు స్థాపించారు. వీటి ద్వారా 47,086 మంది ఉపాధి పొందతున్నారు.

ప్రభుత్వ సహకారంతోనే..



కొట్టార్లలో కంపెనీ పెట్టడానికి ప్రధాన కారణం ప్రభుత్వ ప్రోత్సాహమే. అర్హతలను బట్టి చిత్తూరు పరిసర ప్రాంత వాసులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. రీసెర్చ్ ఓరియెంటెడ్, హార్డ్‌కోర్ టెక్నాలజీని ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి మా సంస్థకు బెంగళూరుతో పాటు ఇతర దేశాల్లోనూ కస్టమర్లు ఉన్నారు. ఈ ఏడాది జూలైలో కంపెనీ ప్రారంభించే దిశగా పనులు సాగుతున్నాయి.

– దీపక్ కుమార్ తాళ్ల, చైర్మన్, డీవీ గ్రూప్ కంపెనీస్

పరిశ్రమల స్థాపనకు అనువైన ప్రాంతం



పరిశ్రమల స్థాపనకు ఇది అనువైన ప్రాంతం. ఎగుమతులు, రవాణాకు హైవేలు ఉన్నాయి. సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి.

– చంద్రశేఖర్, డీఐఓ చిత్తూరు జిల్లా

అటవీశాఖ అనుమతులొస్తే...



విజయపురం మండలం కోసలనగరంలో ఏర్పాటు చేయనున్న సెజ్‌కు ఏ,బీ,సీ,డీ,ఈ- బ్లాకులుగా భూములు కేటాయించనున్నారు. వీటిలో ఏ-బ్లాక్‌కు సంబంధించి ఇప్పటికే 1500 ఎకరాల భూములు సేకరించి అన్ని అనుమతులు పొందారు. 'బి' బ్లాక్‌కు కోసలనగరం, పాత ఆర్కాడు ప్రాంతాల్లో భూసేకరణ పూర్తయ్యింది. అటవీశాఖ పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సి ఉంది. ఇది పూర్తయితే ఆ స్థలాలను పరిశ్రమలకు ఏపీఐఐసీ కేటాయిస్తుంది.

–అమరేంద్రబాబు, తహసీల్దార్, విజయపురం

తేలిపోయిన యువ గళం!

- కుప్పంలో నారాలోకేష్ పాదయాత్రకు స్పందన అంతంత మాత్రమే
- జనాలను తరలించినా నిండని సభ
- యువగళం వలంటీర్ల ఓవరాక్షన్

కుప్పం రూరల్: యువగళం పాదయాత్ర మొదటరోజే తేలిపోయింది. దాదాపు రెండు నెలలుగా ఆహా..ఓహో.. అంటూ ఊదరగొట్టినా జనాలను మాత్రం ఆకట్టుకోలేకపోయింది. శనివారం టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌బాబు చేపట్టిన పాదయాత్రకు స్పందన అంతంతమాత్రంగా కనిపించింది. ఆయన కుప్పంలోని లక్ష్మీపురం నుంచి పాదయాత్ర ప్రారంభించగా.. సాయంత్రం కమతమూరు సమీపంలో జరిగిన బహిరంగ సభ జనాలు లేక వెలవెలబోయింది. తమిళనాడు, కర్ణాటక నుంచి జనాలను తరలించినా ఫలితం లేకపోయింది. సభాప్రాంగణం సగభాగం వరకు దాదాపు ఖాళీగా కనిపించింది. లోకేష్‌బాబు ప్రసంగిస్తుండగా మధ్యలోనే జనం వెళ్లడం చర్చనీయాంశమైంది. అడుగడుగునా యువగళం వలంటీర్లు జనాలపై విరుచుకుపడడం స్థానిక టీడీపీ కార్యకర్తలకు విసుగుపుట్టించింది. పాదయాత్ర మార్గంలోని రోడ్లపై చిరుదు కాణాలను కార్యకర్తలు తొక్కుకుంటూ వెళ్లడంతో వ్యాపారులు కన్నీళ్లు పెట్టుకున్నారు. పలమనేరు-క్రిష్ణగిరి హైవేపై ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోయింది.



వెలవెలబోతున్న సభాప్రాంగణం




రైల్వే ఫ్లైఓవర్ వద్ద ఆగిపోయిన ట్రాఫిక్



ధ్వంసమైన పూల దుకాణం

సైన్స్ పరిశోధనలు మరింత విస్తృతం

- పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఐసర్ డైరెక్టర్ కేఎన్ గణేష్



తిరుపతి మంగళం : సైన్స్ పరిశోధనలను దేశవ్యాప్తంగా విస్తృతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)లను తీసుకొచ్చిందని.. వీటి ద్వారా మానవాళికి ఉపయుక్తంగా ఉండేలా సైన్స్ పరిశోధనలు చేస్తున్నట్టు పద్మశ్రీ అవార్డు గ్రహీత, తిరుపతి ఐజర్ డైరెక్టర్ కేఎన్ గణేష్ చెప్పారు. శుక్రవారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని ఐసర్ ట్రాన్సిట్ క్యాంపస్‌లో మీడియాతో మాట్లాడారు. తనకు పద్మశ్రీ అవార్డు పురస్కారం ప్రకటించడంతో మరింత బాధ్యతగా సైన్స్ పరిశోధనల పట్ల ముందుకెళ్తానని స్పష్టం చేశారు. 2015లో శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలల తాత్కాలిక భవనంలో తిరుపతి ఐసర్ ప్రారంభించినట్టు తెలిపారు. రెండున్నరేళ్లలో కేంద్ర క్యాబినెట్ అప్రూవల్‌తో ఐసర్ సొంత క్యాంపస్ నిర్మాణానికి నిధులు కేటాయించుకోగలిగామని, ఈ ఏడాది చివరిలోపు నూతన ఐసర్ క్యాంపస్‌లోకి అడుగుపెడుతున్నట్టు తెలిపారు. తిరుపతి ఐసర్‌లో నిష్ణాతులైన ప్రొఫెసర్లుండటంతో అనతి కాలంలోనే ఈ సంస్థ ఖ్యాతి విశ్వవ్యాప్తమైందన్నారు.

ఐసర్, ఐఐటీ సంయుక్తంగా పరిశోధనలు

భవిష్యత్తులో విద్యుత్, వ్యవసాయం, జీవావరణ-పర్యావరణంపై ఐసర్, ఐఐటీలు సంయుక్తంగా పరిశోధనలు జరిపేందుకు నిర్ణయించినట్టు గణేష్ తెలిపారు. ఐసర్, ఐఐటీ సంయుక్తంగా అమరరాజా బ్యాటరీస్ సంస్థతో లిథియం బ్యాటరీలను రీసైక్లబుల్ చేయడానికి, ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీతో తక్కువ నీటి సరఫరాతో నూతన క్రాప్‌లపై పరిశోధనలు చేయడానికి నిర్ణయించామన్నారు. ఇటీవల వైరస్‌ల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని.. దీంతో అధునాతన ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రతిష్టాత్మక యూనివర్సిటీలు, ఇనిస్టిట్యూట్లతో తిరుపతి నేడు ఎడ్యుకేషనల్ హబ్‌గా మారిందని, జర్నలిస్టులు కూడా సైన్స్ జర్నలిజంపై అవగాహన కలిగి ఉండాలని డైరెక్టర్ గణేష్ సూచించారు. కార్యక్రమంలో తిరుపతి ఐసర్ రిజిస్ట్రార్ డాక్టర్ సీపీ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి


చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రేమ

బంగారుపాళెం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందిందని ఏఎస్‌ఐ మల్లప్ప తెలిపారు. మండలంలోని కేజీ సత్రం వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో కారు డ్రైవరు మృతి చెందగా, మరో కారు డ్రైవరు, గోకుల్, పుత్తూరుకు చెందిన రాజాపతి, అతని భార్య ప్రేమ తీవ్రంగా గాయపడటం విదితమే. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ప్రేమ(60) కన్నుమూసింది. ఏఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంటలపై ఏనుగుల దాడి


ఏనుగులు నాశనం చేసిన టమాట పంట

బైరెడ్డిపల్లె: మండలంలోని కడపనత్తం అటవీ సమీప పంటపొలాలపై గురువారం రాత్రి ఏనుగుల గుంపు దాడులు చేయడంతో తీవ్ర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. కడపనత్తంకు చెందిన సమీర్ సాగు చేసిన టమాట, మామిడి, కొబ్బరిచెట్లను ఏనుగులు తొక్కి నాశనం చేశాయి.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంపు

- జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశం


కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌లో చిరుధాన్యాలు విరివిగా సాగు చేస్తున్నారని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులు అరుణ్ కుమార్, వీరపాండియన్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లో కాన్ఫరెన్స్‌లో జేసీ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలో సాధారణంగా 674 హెక్టార్లలో చిరుధాన్యాలు సాగవుతాయన్నారు. ఇప్పటి వరకు 174 హెక్టార్లలో సాగు చేశారని, తద్వారా 700 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు చెప్పారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు రేషన్ దుకాణాలలో ఉచితంగా బియ్యంతో పాటు చిరు ధాన్యాలను కూడా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మద్దతు ధర క్వింటాలుకు రూ. 3575 పొందవచ్చునని తెలిపారు. రేషన్ దుకాణాలకు సరఫరా చేసే చిరుధాన్యాలు రైతులు కావాలని భావిస్తే తిరిగి రేషన్ షాపుల నుంచి ఉచితంగా పొందవచ్చన్నారు. జిల్లాలో గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం బైరెడ్డిపల్లె, వి.కోట గంగవరం, కుప్పం పలమనేరు, పెద్ద పంజాణి, చౌడేపల్లె బంగారుపాళ్యం, యాదమరి, తవణంపల్లె, గుడిపాల, ఐరాల మండలాలలో చిరుధాన్యాలు సాగు చేస్తున్నారన్నారు. చిరుధాన్యాలకు సంబంధించి ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పీఎం అవార్డుకు ఆవిష్కరణలు పంపండి

వివిధ పథకాలు, కార్యక్రమాలపై పీఎం అవార్డుకు ఆవిష్కరణల ప్రతిపాదనలు పంపాలని జేసీ వెంకటేశ్వర్ అన్నారు. పీఎం అవార్డుల ప్రదానంపై కేంద్ర ప్రభుత్వ అధికారులు న్యూఢిల్లీ నుంచి శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం 2021 నుంచి సెప్టెంబర్ 2022 వరకు చేపట్టిన వివిధ పథకాలు కార్యక్రమాలపై పీఎం అవార్డుకు ఆవిష్కరణలు జిల్లా స్థాయి నుంచి పంపాలని కేంద్ర పరిపాలన రిఫార్మ్స్ ప్రజా స్పందన అడిషనల్ కార్యదర్శి అమర్‌నాథ్ కోరారు. అనంతరం జేసీ మాట్లాడుతూ.. మహిళా–శిశు సంక్షేమ రంగంలో, పోషణ అభియాన్, గర్భిణుల ఆరోగ్య సంరక్షణ, రక్తహీనత సమస్యతో ఉన్న వారి ఆరోగ్యానికి తీసుకుంటున్న చర్యలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం, వారికి అదనంగా ఇస్తున్న ఆహారం గురించి ఆవిష్కరణలో పొందుపరచాలని సూచించారు. గ్రామ పంచాయతీల భాగస్వామ్యంతో విద్యాశాఖ అధికారులు, సామాజిక కార్యకర్తలు, మిషన్ డైరెక్టర్లు, మహిళా–శిశు సంక్షేమ సంస్థలు ఈ ఆవిష్కరణలను నిర్దేశిత గడువులో పంపాలని సూచించారు.

భక్తిప్రపత్తులతో కుంభాభిషేక పూజలు


అమ్మవారికి సారె తీసుకువస్తున్న కాణిపాక ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు

- హాజరైన ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, ఆర్టీసీ వైస్ చైర్మన్

చిత్తూరు రూరల్: చిత్తూరు మురకంబట్టు కర్ణం కాలనీలో శుక్రవారం శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయంలో గణపతి, హోమ, కలశ పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి వరకు కుంభాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మేయర్ అముద తదితరులు హాజరయ్యారు. కాణిపాక దేవస్థాన చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ అభివృద్ధి కమిటీ, శ్రీ విశ్వ జననీ చారిటబుల్ అభివృద్ధి ట్రస్ట్ మోక్ష దాయని వైస్ ప్రెసిడెంట్ సురేష్ అమ్మవారి దర్శనానంతరం ముఖ్యఅతిథులను సన్మానించి ప్రసాదాలు అందజేశారు. రాత్రి అమ్మవారిని స్థానిక వీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు.

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు రాగిమానుపెంట విద్యార్థులు


క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు మండలంలోని ఎగువ రాగిమానుపెంట జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ఎంపికైనట్లు శుక్రవారం హెచ్‌ఎం సుజాత తెలిపారు. ఈ నెల 21న బీఎన్‌ఆర్ పేట పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారన్నారు. అండర్–17 బాల బాలికల విభాగంలో తమ స్కూలుకు చెందిన యుగళ, చరిష్మ, భరత్, అండర్–14 విభాగంలో సోనియా, అక్షయ, నేతాజి, పల్లవి ప్రతిభ చాటారన్నారు. కాకినాడలో ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలలో జిల్లా తరఫున వీరంతా ప్రాతినిధ్యం వహిస్తారు. క్రీడాకారులను, వ్యాయామోపాధ్యాయుడు గురుప్రసాద్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు చైతన్య


చైతన్య

చౌడేపల్లె: జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీ బాల్ అండర్–17 పోటీలకు మఖ్రిమాకులపల్లె ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని పి.చైతన్య ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు నాదముని శుక్రవారం తెలిపారు. ఇటీవలే కర్నూలు జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చాటడంతో ఆ విద్యార్థిని జాతీయ స్థాయికి ఎంపికైంది. హెచ్‌ఎంతోపాటు పీడీ పవన్‌కుమార్, ఉపాధ్యాయులు, సర్పంచ్ షంషీర్ బాషా, సింగిల్‌విండో డైరెక్టర్ రమేష్‌బాబు, పీఎంసీ కమిటీ చైర్మన్ నరసింహులు తదితరులు అభినందించారు.

ఉచితంగా మోడల్ పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు ఈ నెల 29న ఉచితంగా ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నరోత్తమరెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జిల్లాలో గుర్తించిన పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తామని, దీనిని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మోడల్ పరీక్షకు రెడ్డి విఠల్, జయచంద్రబాబు సహకారం అందించారని, ప్రత్యేకంగా మోడల్ పరీక్ష ప్రశ్నపత్రాలను ముద్రిస్తున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 94414 80587, 94413 93590 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

బీటెక్ విద్యార్థిపై దాడి


చికిత్స పొందుతున్న కార్తీక్

నారాయణవనం: బీటెక్ విద్యార్థిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన శుక్రవారం సాయంత్రం కలకలం రేపింది. బాధితుని కథనం.. స్థానికంగా ఉన్న ఒక ఇంజినీరింగ్ కళాశాలలో కార్తీక్ బీటెక్ మెకానికల్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల మైదానంలో స్నేహితులతో కలిసి బాస్కెట్‌బాల్ ఆడుకుని సాయంత్రం 6 గంటల సమయంలో తాను ఉంటున్న హాస్టల్‌కు బయలుదేరాడు. మార్గమధ్యంలో రెండు మోటార్ సైకిళ్లలో నలుగురు ఆగంతకులు వచ్చి కార్తీక్‌పై దాడిచేశారు. ఇద్దరు ఒడిసి పట్టుకోగా..మరో ఇద్దరు పిడిగుద్దులు కురిపించి, పారిపోయారు. అయితే ఈ దాడికి కారణాలు తెలియరాలేదు. కార్తీక్‌ను ప్రథమ చికిత్స నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై స్థానిక పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

పండంటి బిడ్డ @ 4.47

- సుఖ ప్రసవం చేసిన పుంగనూరు ప్రభుత్వాస్పత్రి వైద్యులు



చిరునవ్వులు చిందిస్తున్న శిశువు, బిడ్డతో ఉన్న రేష్మా తాజ్

పుంగనూరు: పురిటి నొప్పులు కాస్త కష్టమనిపిస్తే సిజేరియన్లకే మొగ్గు చూపుతున్న కాలమిది! మరి ప్రభుత్వాస్పత్రుల్లో అయితే.. రిస్కా? అయితే రెఫర్ చేసేద్దాం! అని ఆ వైద్యులు అనుకోలేదు. పురిటి నొప్పులతో వచ్చిన ఓ నిండుగర్భిణికి సుఖప్రసవం చేశారు. గంటపాటు శ్రమించి 4.47 కిలోల బరువున్న పండంటి శిశువును ఈ లోకంలోకి తీసుకువచ్చారు. ప్రసవాలకు ప్రభుత్వ ఆస్పత్రులే శ్రేయస్కరం– అని తమ సేవలతో చాటిచెప్పారు. వివరాలు.. పట్టణంలోని రాంరహీమ్‌వీధిలో నివాసం ఉన్న రేష్మా తాజ్(35) పురిటి నొప్పులతో శుక్రవారం మధ్యాహ్నం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేరింది. ఆమెను మెడికలాఫీసర్ జశ్వంత్, గైనకాలజిస్ట్ చందన పరీక్షించారు. ఆమె ఉన్న స్థితి బట్టి కాన్పు కష్టమవుతుందేమోనని తొలుత భావించారు. రేష్మాకు ధైర్యం చెప్పారు. ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. నర్సులు అనిత, భార్గవి వారికి సహకారం ఇచ్చేందుకు తోడయ్యారు. ఇక ఆ బృందం కత్తెర, ఫోర్‌సెప్స్..మొదలైన వాటి జోలికి వెళ్లలేదు. కాన్పు చేయడంపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. గంటపాటు వైద్యసేవలు అందించారు. దీంతో రేష్మా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆ శిశువు 4.47 కేజీల బరువుతో పుష్టిగా, ఆరోగ్యంగా ఉండడంతో వైద్యబృందం కళ్లల్లో ఆనందం తొంగిచూసింది. రేష్మా మాతృత్వ మధురిమతో బిడ్డను అక్కున చేర్చుకుంది.

ఇది మూడో కాన్పు

తొలి రెండు కాన్పుల్లో రేష్మా 3.8, 3.9 కిలోల బరువున్న ఆడపిల్లలకు జన్మనివ్వగా, ఇప్పుడా రికార్డును బ్రేక్ చేసిందనే చెప్పాలి. పైగా 35 ఏళ్ల వయస్సులో గర్భం దాల్చితే కాన్పు పరంగా రిస్క్ ఎక్కువ. అయితే ప్రతి నెలా క్రమం తప్పకుండా రేష్మా వైద్యపరీక్షలు చేయించుకునేదని, మధుమేహం, రక్తపోటు లాంటి సమస్యలేవీ లేకపోవడంతో సాధారణ కాన్పు చేయాలని నిర్ణయించినట్లు డాక్టర్ చందన 'సాక్షి'కి తెలిపింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి తమ సొంత నిధులు రూ.2కోట్లతో ఆక్సిజన్ ప్లాంట్, చిల్డ్రన్స్ కేర్ యూనిట్, ప్రసూతి విభాగం ఏర్పాటు చేసి అన్ని సదుపాయాలు కల్పించడంతో ధైర్యంగా కాన్పులు చేస్తున్నట్టు వారు చెప్పారు. హాస్పిటల్‌లో నెలకు సగటున 35 వరకూ కాన్పులు చేస్తున్నామని, అలాగే కొన్ని సిజేరియన్ కేసులూ చేస్తున్నట్టు వైద్యబృందం తెలిపింది.

పిల్లల్లో భాషాభిరుచి కలిగించడం అభినందనీయం


మండలి బుద్ధప్రసాద్‌ను సన్మానిస్తున్న తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి నిర్వాహకులు

పలమనేరు: పిల్లల్లో తెలుగు భాషాభిరుచిని కలిగించడం అభినందనీయమని పూర్వ తెలుగు అధికార భాషాసంఘం అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పట్టణ సమీపంలోని కళామందిరంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. భాషాభివృద్ధి కోసం తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి చేస్తున్న కృషిని మెచ్చుకుని సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు, పుష్ప దంపతులను అభినందించారు. అనంతరం వారు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో శ్రీరామచంద్రమూర్తి, గురుమూర్తి, శివశంకర్, గిరిధర్‌మూర్తి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కేటుగాడు

- బెయిల్‌పై వచ్చి మళ్లీ హస్తలాఘవం
- వల పన్ని అరెస్ట్ చేసిన ఎస్‌ఐ
- గంజాయి, నగదు స్వాధీనం


మునిసుబ్రమణ్యం (ఫైల్)

వడమాలపేట: డబ్బులు డ్రా చేసిస్తా..పిన్ నంబర్ జనరేషన్ చేసిస్తా..అని ఏటీఎంల వద్ద కార్డులు మార్చి, డబ్బులు కొట్టేస్తున్న ఓ కేటుగాడిని వలపన్ని వడమాలపేట పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్ వద్ద ఇది చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాలు.. ఏర్పేడు మండలం కందాడకు చెందిన పిండి ముని సుబ్రమణ్యం(40) ఒక జులాయి. ఏటీఎంల వద్ద ప్రజలను ఏమార్చి, వారి కార్డులు మార్చేసి, డబ్బులు డ్రా చేసి జల్సా చేయడమే ఇతడి ప్రవృత్తి. మూడు రోజులు క్రితం మండలంలోని పాదిరేడు దళితవాడకు చెందిన వాసు కొత్త ఏటీఎం కార్డు పిన్ నంబర్ జనరేషన్ చేసుకోవడానికి స్థానిక ఎస్‌బీఐ ఏటీఎంకు వచ్చాడు. అక్కడే ఉన్న సుబ్రమణ్యంకు తన కార్డుకు పిన్ నంబర్ జనరేషన్ చేసి ఇవ్వమని కోరాడు. ఇదే అవకాశంగా ఆ కేటుగాడు ఆ కార్డుకు పిన్ జనరేషన్ చేస్తున్నట్లు నటించాడు. కార్డు పనిచేయడం లేదంటూ తన వద్ద ఉన్న మరో ఏటీఎం కార్డు ఇచ్చి పంపించేశాడు. అతను వెళ్లిన తర్వాత వాసు ఏటీఎం కార్డుతో రోజుకు రూ.40వేల చొప్పున 1,20,000 డ్రా చేశాడు. తన అకౌంట్ నుంచి ఎవరో డబ్బులు డ్రా చేశారని తెలుసుకున్న వాసు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఏటీఎం వద్ద నిఘా ఉంచారు. అలాగే అక్కడి సీసీ కెమెరాలలో రికార్డైన దృశ్యాలను పరిశీలించి నిందితుడిని గుర్తించారు. ఈ నేపథ్యంలో మళ్లీ ఎవరినైనా బురిడీ కొట్టించడానికి ఏటీఎంకు వచ్చిన సుబ్రమణ్యంను మఫ్టీలో ఉన్న పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి 200 గ్రాముల గంజాయి, రూ.36 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై ఇప్పటికే శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు, పుత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదై ఉన్నాయని, 2017 నుంచి ఇతడు ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. అంతేకాకుండా బెయిల్ పొంది వచ్చినా అతడి తీరు మారలేదు. అరెస్ట్ చేసిన నిందితుడిని కోర్టుకు తరలించారు.

అదృశ్యమైన విద్యార్థి కథ సుఖాంతం

- చిల్లకూరులో అదృశ్యం–తిరుపతిలో ప్రత్యక్షం
- 'సాక్షి' కథనం ఆధారంగా గుర్తించిన తిరుపతి ట్రాఫిక్ పోలీసులు


గురుకుల విద్యార్థిని తండ్రి రమణయ్యకు అప్పగిస్తున్న సీఐ

చిల్లకూరు: అదృశ్యమైన ఇంటర్ విద్యార్థి వ్యవహారం సుఖాంతమైంది. గూడూరు రూరల్ సీఐ దశరథరామారావు కథనం.. గూడూరు రూరల్ తిప్పవరప్పాడుకు చెందిన రమణయ్య కుమారుడు దినేష్ స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లి వచ్చినప్పటి నుంచి ముభావంగా ఉండేవాడు. ఈ నేపథ్యంలో అతను ఈ నెల 23న మధ్యాహ్నం భోజనానంతరం కళాశాల నుంచి అదృశ్యం అయ్యాడు. హాస్టల్ హోమ్ మాస్టర్ బాల వెంకటేశ్వర్లు బాలుడి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో 24న రాత్రి చిల్లకూరు పోలీస్ స్టేషన్‌లో బాలుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఇక, బాలుడి ఫొటోతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో తిరుపతి పోలీసుల నుంచి చిల్లకూరు పోలీసులకు ఫోన్ వచ్చింది..దినేష్‌ను ట్రాఫిక్ పోలీసులు గుర్తించి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారని! సాక్షిలో ప్రచురించిన కథనం ఆధారంగా అతడిని గుర్తించారు. దీంతో స్థానిక పోలీసులు అక్కడికి వెళ్లి దినేష్‌ను తీసుకువచ్చారు. అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి హోమ్ మాస్టర్ సమక్షంలో బాలుడి తండ్రి రమణయ్యకు అప్పగించారు.

టీటీడీకి 20 టన్నుల కూరగాయల వితరణ


టీటీడీ వాహనానికి పూజలు చేసిన శ్రీవారి సేవకులు


సేకరించిన కూరగాయలు

పలమనేరు: రథసప్తమి సందర్భంగా తిరుమలకు విచ్చేసే శ్రీవారి భక్తులకు అన్నదానం చేయడం కోసం పలమనేరుకు చెందిన శ్రీవారి భక్తులు కాబ్బల్లి రవీంద్రారెడ్డి సౌజన్యంతో కర్ణాటక రాష్ట్రంలోని కోలారు, చింతామణితో పాటు స్థానిక మార్కెట్ల నుంచి 20 టన్నుల వివిధ రకాల కూరగాయలను సేకరించారు. వాటిని టీటీడీ వాహనంలో శుక్రవారం తిరుమలకు పంపారు. ఈ సందర్భంగా శ్రీవారి సేవకులు పలమనేరు మార్కెట్ వద్ద కూరగాయల వాహనానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు మార్కెట్ యజమానులు పాల్గొన్నారు.